# సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 19 । మార్చి । 2024






**కలెక్టర్‌తో ఆర్డీవో భేటీ**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఆర్డీవోగా నియమితులైన గంగయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి మొక్క అందించారు.



**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళ 6.05 | బుధ 4.45 |

గరిష్టం/కనిష్టం
34.0/25.4

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల అప్పుడప్పుడు ఉరుములతో కూడిన చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశంలో భక్తులు

**రామగుండం:** అంతర్గాం మండలం మొర్మూర్ గోదావరినదీ తీరంలో రెండు రోజులుగా సాగుతున్న మల్లికార్జునస్వామి జాతర సోమవారం ముగిసింది. వేకువజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఇప్పలపల్లి భరత్‌స్వామి, జంగమ మహేశ్వరులు, నర్ర సతీశ్‌యాదవ్ ఒగ్గు కళాబృందం చేపట్టిన ప్రదర్శన భక్తులను మంత్రముగ్దుల్ని చేసింది. జాతర కార్యనిర్వాహక కమిటీ గోపు అయిలయ్యయాదవ్, గోపు వంశీయులు మల్లయ్య యాదవ్, చంద్రయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### బాలరాజుపల్లెకు బస్సొచ్చింది..



బస్సు ప్రారంభించాక మహిళల సంతోషం

**జూలపల్లి(పెద్దపల్లి):** మారుమూల బాలరాజుపల్లె గ్రామానికి దశాబ్దాల తర్వాత ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు సంబురాలు చేసుకున్నారు. ఇన్నాళ్లూ జూలపల్లి, కుమ్మరికుంట లేదా వడ్కాపూర్ వరకు కాలినడకన వెళ్తేనే ఆర్టీసీ బస్సు ప్రయాణ భాగ్యం కలిగేది. అయితే, ఎమ్మెల్యే విజయరమణారావు హామీ మేరకు గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పెద్దపల్లి నుంచి బాలరాజుపల్లెకు సోమవారం నడిపించారు. ఇది చొప్పదండి వరకు వెళ్తుందని అధికారులు తెలిపారు. మహిళలు బస్సుకు పూజలు చేశారు. ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ వేణుగోపాలరావు, మాజీ చైర్మన్ గండు సంజీవ్, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి అసెంబ్లీ కార్యదర్శి గాజిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు కోరుకంటి మల్లయ్య, జంజీవ్, శంకరయ్య, రేషవేని మల్లయ్య, నలిగేటి ఓదేలు, కుంటూరి లక్ష్మణ్, సతీశ్, రాములు, స్వామి పాల్గొన్నారు.

### కొనసాగుతున్న నీటిసరఫరా



ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు

**రామగుండం:** హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 9.08 టీఎంసీలకు పడిపోయింది. గూడెం ఎత్తిపోతలకు 145 క్యూసెక్కులు, హైదరాబాద్‌కు 237 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలు భారీగా పడిపోతున్నాయి. తలాపున గోదావరి నది, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా.. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్య తలెత్తడంతో జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### బంజేరుపల్లి తండాలో డెంగీ కలకలం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గౌతం

**ధర్మారం(ధర్మపురి):** బంజేరుపల్లి తండా– బీ గ్రామానికి చెందిన ఇస్లావత్ సమత(35) డెంగీ బారినపడి చికిత్స పొందుతున్నట్లు కటికెనపల్లి సబ్‌సెంటర్ పల్లె డాక్టర్ గౌతం తెలిపారు. రెండు రోజుల క్రితం జ్వరం రాగా రక్త పరీక్షలు చేశామని, ఫలితాల్లో డెంగీగా నిర్ధారణ అయిందన్నారు. ప్రస్తుతం ఆమె కోలుకున్నట్లు పేర్కొన్నారు. సమీపంలోని దాదాపు 52 నివాసాల్లో పైరెత్రమ్ ద్రావణం పిచికారీ చేశామని, నీటి నిల్వలు తొలగించామని, పరిసరాల పరిశుభ్రతపై పల్లెవాసులకు అవగాహన కల్పించామని గౌతం తెలిపారు. మరోవైపు.. మేడారం పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో ఉచిత శిబిరం నిర్వహించారు. మలేరియా నోడల్ అధికారి దామోదర్‌రెడ్డి, సూపర్‌వైజర్ జయ, ఏఎన్‌ఎం స్వరూప, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### యువతకు ఉచిత శిక్షణ

**పెద్దపల్లిరూరల్:** హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామని, ఆసక్తి గలవారు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెయినింగ్ ప్రోగ్రాం పూర్తయిన వారికి ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్‌మెంట్ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 040–29303 130 ఫోన్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.



సభకు హాజరైన జనం

# మరెన్నో ఇస్తాం

- ఎన్‌హెచ్–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, టర్మరిక్ బోర్డు ఏర్పాటు చేశాం
- రైతులు, మహిళలు, యువతను ఆదుకున్నాం..
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తెరచాటు మిత్రులు
- బీజేపీని గెలిపించండి
- జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని నరేంద్ర మోదీ



వేదికపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్, గోమాస శ్రీనివాస్, ఎమ్మెల్యేలు రామారావుపటేల్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బొడిగె శోభ, బోగ శ్రావణి తదితరులు

**సాక్షి ప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/జగిత్యాలరూరల్:** తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో నిజామాబాద్–ఖమ్మం వరకు ఎన్‌హెచ్–563, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ, రైలు మార్గాల నిర్మాణం, టర్మరిక్ బోర్డు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి నిధులు.. ఇలా ఎన్నో ఇచ్చాం.. వచ్చే పదేళ్లలో తెలంగాణ ప్రగతిపై ఫోకస్ చేసి, మరెన్నో ఇస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో రోడ్లు, రైలు, గోదాంలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన విజయ సంకల్ప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రసంగించారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి జిల్లాలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ కోసం బీజేపీని గెలిపించాలని, అబ్ కీ బార్ 400 పార్ అని పిలుపునిచ్చారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరతో రైతులను, సంక్షేమ పథకాలతో మహిళలను, రుణాలిచ్చి యువతను ఆదుకున్నామని తెలిపారు. పసుపు మద్దతు ధర, టర్మరిక్ బోర్డు ఏర్పాటు, నిజాం షుగర్ ఫ్యాక్టరీకి, ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణకు రూ.6,400 కోట్లు వెచ్చించామన్నారు. కాళేశ్వరం అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల తీరును ఎండగట్టారు. ఆ పార్టీలు తెరచాటు మిత్రులని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ అగ్రనాయకులు లక్ష్మణ్, సత్యనారాయణరావు, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి, నిర్మల్ ఎమ్మెల్యే పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రజాకార్ సినిమా చూడండి



వీరులను కన్న గడ్డ జగిత్యాలలో పీఎఫ్‌ఐ లుచ్చాగాళ్ల అడ్డా పెట్టి, పాకిస్తాన్ జిందాబాద్ అంటుంటే వాళ్లకు ఆర్థిక సాయం చేస్తున్న వాళ్లను వదిలేద్దామా? నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణత్యాగం చేసిన వీరులు జగిత్యాల సొంతం. రాముని పేరు చెబితే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్లు గజగజ వణుకుతున్నరు. దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముని గుడిని కట్టింది బీజేపీయే. మా పార్టీ బరాబర్ శ్రీరాముని పేరుతో ఎన్నికల్లోకి వెళ్తుంది. మీకు దమ్ముంటే బాబర్ పేరుతో ఓట్లడగండి. తెలంగాణ ప్రజలారా... ప్రతిఒక్కరూ రజాకార్ సినిమా చూడండి. నిజాం సమాధి వద్ద మోకరిల్లిన కేసీఆర్, ఒవైసీ సోదరులను కట్టేసి, ఈ సినిమా చూపించండి.

– ఎంపీ బండి సంజయ్



### దేశ ప్రజలందరూ ప్రధాని కుటుంబమే

ప్రధాని నరేంద్ర మోదీకి కుటుంబం లేదంటున్న విపక్షాలకు సిగ్గులేదు. దేశ ప్రజలందరూ ఆయన కుటుంబమే. వేములవాడ రాజన్న ఆశీర్వాదంతో తెలంగాణ నుంచి బీజేపీ తరఫున అత్యధిక ఎంపీ స్థానాలు గెలిచి, ప్రధానికి కానుకగా ఇద్దాం. పదేళ్ల యూపీఏ హయాంలో జరగని స్కాం లేదు. బీఆర్‌ఎస్ కాళేశ్వరం నుంచి కరెంటు వరకు అవినీతి మయం చేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక చేతులెత్తేసింది.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత



### ఐదో ఆర్థిక శక్తిగా మన దేశం

ప్రధాని మోదీ వల్లే మన దేశం ప్రపంచ దేశాల్లో బలమైన ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది. మయన్మార్, పాకిస్తాన్ లాంటి దేశాలను దారికి తెచ్చిన ఘనత ఆయనదే. మోదీ వల్లే దేశంలో సుస్థిరత, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. ఇటీవల సీఏఏ అమలు చేశారు. త్వరలో ఎన్‌ఆర్‌సీ, యూసీసీ కోడ్‌ను కూడా అమలు చేస్తారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి.

– ఎంపీ ధర్మపురి అర్వింద్

## మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రమ

- వైస్ చైర్మన్‌గా సీపతి బానయ్య

**మంథని:** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెంద్రు రమ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా సీపతి బానయ్యను ఎన్నుకున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో, అధీకృత అధికారి, మంథని ఆర్డీవో హనుమా నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్ ఎన్నికకు 13వ వార్డు కౌన్సిలర్ పెంద్రు రమ పేరును ఒకటో వార్డు కౌన్సిలర్ గుండా విజయలక్ష్మి ప్రతిపాదించారు. 12వ వార్డు కౌన్సిలర్ వేముల లక్ష్మి బలపరిచారు. పోటీలో ఒక్కరే ఉండడంతో పెంద్రు రమ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే వైస్ చైర్మన్ కోసం పదో వార్డు సభ్యుడు సీపతి బానయ్య పేరును తొమ్మిదో వార్డు కౌన్సిలర్ చొప్పకట్ల హనుమంతరావు ప్రతిపాదించగా, 11వ వార్డు కౌన్సిలర్ వడ్లకొండ రవి బలపరిచారు. ఇక్కడ కూడా పోటీలో ఒక్కరే ఉండడంతో ఏకగ్రీవమైనట్లు ఆర్డీవో ప్రకటించారు. అనంతరం చైర్‌పర్సన్ రమ, వైస్ చైర్మన్ బానయ్యతో అధీకృత అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. ఆ తర్వాత రమ, బానయ్య కలిసి రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు నివాసంలోని దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, నక్క నాగేంద్ర, కొట్టి పద్మ, ఎంపీపీ కొండ శంకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణపత్రం అందిస్తున్న ఆర్డీవో హనుమా నాయక్

## వేతనాలు రాక.. వెతలు తీరక..

- ఆవేదనలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు
- 22న కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు సన్నద్ధం



వినతిపత్రం అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

**సుల్తానాబాద్(పెద్దపల్లి):** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన సేవలు అందిస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు, ఫార్మసిస్టులు, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లకు సుమారు మూడు నెలలుగా వేతనాలు విడుదల కావడం లేదు. దీంతో తమ కుటుంబ పోషణ ఎలా అని వారు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా.. తమపై వివక్ష చూపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**జిల్లాలో 1,202 మంది ఉద్యోగులు..**

- జిల్లాలో 18 పీహెచ్‌సీలు, 6 అర్బన్ హెల్త్‌సెంటర్లతోపాటు గ్రామాల్లో సబ్ సెంటర్లలో 1,202 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.
- వీరు గర్భిణులకు ప్రతినెలా డాక్టర్ల వద్దకు తీసుకెళ్తున్నారు. వైద్య పరీక్షలు చేయిస్తున్నారు.
- పౌష్టికాహారం అందిస్తున్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయిస్తున్నారు.
- సాధారణ ప్రసవం చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.
- అంతేకాదు.. ప్రసవం తర్వాత కూడా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడంలోనూ వీరు కీలకపాత్ర పోషిస్తున్నారు.
- వీరికి మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా..**

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా వేతనాలు విడుదల కావడం లేదు. దీంతో ఇంటి అద్దెలు చెల్లించలేకపోతున్నారు. నిత్యావసరాల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అప్పుచేసి ఆకలి తీర్చుకునే దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎం నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని వాపోతున్నారు.

**16 ఏళ్లలో తొలిసారి..**

- ఎన్‌హెచ్‌ఎం నుంచి విడుదలయ్యే నిధులను కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో ప్రతినెలా ఒకటి నుంచి ఐదో తేదీలోపు జమచేసేవారు.
- అయితే, 16ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఈ ఏడాది ప్రారంభం నుంచి వేతనాలు విడుదల కావడం లేదని చెబుతున్నారు.

### విజయవంతం చేయండి



ఎన్‌హెచ్‌ఎంలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తాం. ఈ కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేయండి.

– కదారి సునీల్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ

### సమస్య పరిష్కరించండి



ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలల నుంచి జీతాలు రావడంలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడంలేదు. దీంతో కలెక్టరేట్ ఎదుట ఈనెల 22న ఆందోళన చేస్తాం.

– మాటూరి నిర్మల, రెండో ఏఎన్‌ఎం

## ప్రజా'వాణి'.. ఓపికగా విని..

- ప్రజావాణి రద్దు చేసినా తరలివచ్చిన అభాగ్యులు
- సమస్యలకు పరిష్కారం చూపిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- సార్.. మా అబ్బాయికి పొరపాటున రెండు ఆధార్ కార్డులు జారీచేశారు. అందులో ఓ కార్డు జారీచేసిన అధికారులే రద్దు చేశామని లేఖ ఇచ్చారు. అయినా సివిల్ సప్లయి అధికారులు రేషన్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేయడం లేదు.

– ఇది శీలంబాబు ఆవేదన



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

**పెద్దపల్లిరూరల్:** పలు ప్రాంతాల నుంచి భూ సంబంధిత, కుటుంబ తదితర సమస్యలతో బాధపడుతూ కలెక్టరేట్‌కు సోమవారం తరలివచ్చిన అభాగ్యులు.. ప్రజావాణి రద్దు చేశారని తెలుసుకున్నారు. రోజూ మాదిరిగానే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ కాలినడకన వస్తుండడాన్ని గమనించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల బాధితులు కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెలిబుచ్చుకున్నారు. తర్వాత తన చాంబర్‌కు వెళ్తుండగా.. ఒక్కొక్కరుగా వచ్చి అర్జీలు అందజేశారు. వీటిని ఓపికగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌ను కలెక్టర్ ఆదేశించారు.

### ఇళ్లు ఇప్పించండి



'డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నం.. లక్కీడ్రాలో లబ్ధిదారులుగా ఎంపికైనం. ఇళ్లు కేటాయించకుండా ఇదిగో..అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నరు. మీరైనా ఇళ్లు ఇప్పించండి' అని పెద్దపల్లి, గోదావరిఖని ప్రాంతాల నుంచి వచ్చినవారు కలెక్టర్ ఎదుట వాపోయారు. స్పందించిన కలెక్టర్.. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యేదాకా ఓపిక పట్టాలని వారిని సముదాయించారు. ఈలోగా జమృత్‌బీ అనే మహిళ స్పృహ తప్పి పడిపోయింది. కలెక్టర్ వెంటనే డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు సమాచారమందించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. తన కూతురు పేరిట మంజూరైన ఇంటికోసం కలెక్టర్‌ను కలువాలని వచ్చినట్లు అమృత్‌బీ తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల విషయంలో ఏమీ మాట్లాడలేనన్నారు.

### మాది పేద కుటుంబం



ఉండేతందుకు ఇల్లు లేని పేదరాలిని. సర్కారు డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు కట్టిత్తదంటే దరఖాస్తు పెట్టిన. కట్టిన ఇండ్లను ఇచ్చేతందుకు తీసిన లక్కీలాటరీల నా పేరు అచ్చింది. అయినా ఇప్పటికీ ఇల్లు ఇయ్యలే. కలెక్టర్ సారైనా కనికరం చూపాలె.

– పూసాల రజిత, తిలక్‌నగర్, పెద్దపల్లి

### అగోఇగో అంటుండ్రు

ఇల్లు మంజూరైందని చెప్పి ఏండ్లు గడుస్తున్నది. ఎవల ఇంటికి వాళ్లకు అప్పజెప్పాలె. ఇంటి కోసం ఎన్నోసార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినం. ధర్నాలు చేసినా ఎవలూ పట్టించుకుంటలేరు. ఇగోఅగో అనుకుంట కాలం జరుపుతండ్రు. మాకు ఇండ్లు ఇయ్యండ్రి.

– పదాల లావణ్య, రంగంపల్లి, పెద్దపల్లి

## పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

**పెద్దపల్లిరూరల్:** పార్లమెంటు ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామని కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్లు శ్యాంప్రసాద్‌లాల్, అరుణశ్రీతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 18నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 26న పరిశీలన, 29వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని, మే13న పోలింగ్ నిర్వహిస్తారని, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపడతారని కలెక్టర్ వివరించారు.

**పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో..**

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 15,92,996 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరికోసం 1,850 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతీరెండు కిలోమీటర్లకో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఓటరు జాబితా తుది సవరణ ప్రకారం జిల్లాలో 7,15,735 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరికోసం 840 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2,291 బ్యాలెట్, 1,243 కంట్రోల్ యూనిట్లు, 1,264 వీవీ పాట్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు.

**ముందస్తు అనుమతులు..**

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారం, సభలు, సమావేశాల కోసం ముందుగా అనుమతులు పొందాలని కలెక్టర్ అన్నారు. సింగిల్‌విండో సిస్టం ద్వారా అనుమతులిస్తున్నట్లు పేర్కొన్నారు. లౌడ్‌స్పీకర్లను ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకే ఉపయోగించాలని ఆయన సూచించారు.

**ఫిర్యాదు చేయండిలా...**

నియమావళిని ఉల్లంఘిస్తే టోల్‌ఫ్రీ నంబరు 1950, సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో నిరంతరం పనిచేసేలా కాల్‌సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీ విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన వెంటనే గంటలోపు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

**ప్రత్యేక బృందాల నియామకం..**

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై అందే ఫిర్యాదులపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గంలో 20 సర్వేలెన్స్ బృందాలు, 21 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 14 వీడియో సర్వేలెన్స్ బృందాలు, 8 వీడియో వ్యూయింగ్ బృందాలు, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

**ఆధారాల్లేని నగదు సీజ్ చేస్తాం..**

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, ఇతర పరికరాలను తరలించే అవకాశమున్న దృష్ట్యా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టామన్నారు. రూ.50వేలకు మించి నగదు వెంట తీసుకువెళ్తే తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలన్నారు.

**పొలిటికల్ లీడర్లతో సమావేశం..**

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ రాజకీయ పార్టీల నేతలను కోరారు. వారితో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్వేషాలు పెంచేలా ప్రసంగాలు ఉండొద్దన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థనామందిరాల్లో ప్రచారం చేయరాదన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, బెదిరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటరు జాబితాను సరిచూసుకోవాలని, పొరపాట్లు దొర్లితే అధికారుల దృష్టికి తేవాలన్నారు. అర్హులైన వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎలక్షన్ డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులున్నారు.

## జెన్‌కో ఆధ్వర్యంలో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే ఠాకూర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

**రామగుండం:** జీవితకాలం ముగిసిన 62.5 మెగావాట్ల సార్థ్యంగల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో కొత్త విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలో స్థాపించాలని ఆ సంస్థ ఉద్యోగులు కోరారు. ఈమేరకు సోమవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణి ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ కేంద్రం స్థాపిస్తారనే ప్రచారం సాగుతోందని, దీనిని తాము వ్యతిరేకిస్తామన్నారు. సింగరేణి విద్యుత్ కేంద్రాన్ని స్థాపిస్తే ప్రభుత్వానికి దానిపై అజమాయిషీ ఉండదని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఠాకూర్.. జెన్‌కో నిధుల కొరతతో సతమతమవుతోందని, ప్రస్తుత విద్యుత్ అవసరాల దృష్ట్యా సింగరేణికి అప్పగించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

## క్లుప్తంగా

### నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్స్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో వీడియో కాన్ఫరెన్సు సౌకర్యం గల రైతువేదికల(కమాన్‌పూర్ మండలం గుండారం, పాలకుర్తి, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి) నుంచి మంగళవారం (ఈనెల19) రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తెలిపారు. వరి సాగు చేస్తున్న రైతులు తమ సందేహాలను రైతువేదిక నుంచి వ్యక్తం చేయాలని, వాటికి జగిత్యాల పొలాస శాస్త్రవేత్త శ్రీనివాస్ సలహాలు, సూచనలిస్తారని పేర్కొన్నారు. ఆయిల్ ఫాం సాగు చేస్తున్న రైతుల సందేహాలకు కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ రాజశేఖర్ సూచనలు, సలహాలు ఇస్తారని వివరించారు. కూరగాయలు పండిస్తున్న వారి సందేహాలను డాక్టర్ కవిత తీర్చుతారని డీఏవో ఆదిరెడ్డి వివరించారు.

### జాతీయస్థాయి ఫిలిం ఫెస్టివల్‌కు ఎంపిక



ప్రోత్సాహకం అందుకుంటున్న వినయ్‌సాయి

మంథని: జాతీయస్థాయిలో ఏటా నిర్వహించే నేషనల్ స్టూడెంట్ ఫిలిం ఫెస్టివల్‌కు మంథనిలోని శ్రీరామ కాలనీకి చెందిన ఆకుల వినయ్‌సాయి షార్ట్ మూవీ ఎంపికయింది. వంద ఎంట్రీలను స్వీకరించిన నిర్వాహకులు.. అందులో 20 ఉత్తమ మూవీలు ఎంపిక చేశారు. ఇందులో తెలంగాణ నుంచి రెండు షార్ట్ మూవీలు ఉన్నాయి. హైదరాబాద్ గీతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న వినయ్ చిత్రీకరించిన «మూవీ ఫోరత్ డీ సైంటిఫిక్» షార్ట్ మూవీ ప్రశంసలు అందుకుంది. ఆదివారం ముంబై యూనివర్సిటీలో రూ.25 వేల నగదు ప్రోత్సాహకాన్ని నిర్వాహకులు వినయ్‌సాయికి అందించారు.

### భరాత్‌లో నృత్యం చేస్తూ..


విజయ్‌కుమార్ మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకలో నృత్యం చేస్తూ కరీంనగర్‌కు చెందిన రావుల విజయ్‌కుమార్(30) హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడితో ఓదెలకు చెందిన ఓ యువతితో ఆదివారం వివాహం జరిగింది. ఆ తర్వాత రాత్రి వేళ భరాత్ జరిగింది. ఇందులో నృత్యం చేస్తుండగా విజయ్‌కుమార్ అకస్మాత్తుగా కుప్పకూలాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య రావుల పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

# బొగ్గు బ్లాకుల వేలానికి సింగరేణి సన్నాహాలు

- మూడు ఓసీపీలు, భూగర్భగనికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- టెండర్లలో దక్కించుకునేందుకు బిడ్స్‌కు సింగరేణి
- నాలుగు బొగ్గు బ్లాకులకు మరో 30 ఏళ్ల భవిష్యత్



గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొనేందుకు సింగరేణి సిద్ధంగా ఉందా? దీనికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? వేలం పాటలో పాల్గొంటే సింగరేణికి లాభమా?నష్టమా? అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో పాల్గొని బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈమేరకు సింగరేణి సంస్థకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో సింగరేణి యాజమాన్యం రాబోయే వేలం పాట కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గతంలో నిర్వహించిన వేలంలో శ్రావణపల్లి బొగ్గుబ్లాక్‌ను దక్కించుకునేందుకు ప్రైవేట్ సంస్థలు ముందుకు రాగా.. స్థానిక ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నేతలు ప్రతిఘటించడంతో బొగ్గు బ్లాకు వేలం పాటలో పాల్గొనలేదు. దీంతో వేలం నిలిచిపోయింది. అయితే కోలిండియా కన్నా ఇక్కడి ఓసీపీల్లో స్ట్రిప్పింగ్ రేషియో అధికంగా ఉండడం, టన్ను బొగ్గుపై పెద్దగా లాభాలు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ప్రైవేట్ సంస్థలు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

**మూడు ఓసీపీలు.. ఒక భూగర్భగని..**

సంస్థ వ్యాప్తంగా ఉన్న మూడు ఓసీపీలు, ఒక భూగర్భగనిని దక్కించుకోవాలని సింగరేణి చూస్తున్నట్లు తెలుస్తోంది. తాడిచర్ల-2, కోయగూడెం ఓసీపీ-3, శ్రావణపల్లి ఓసీపీతో పాటు కేకే-6 భూగర్భగని కోసం యాజమాన్యం సిద్ధమవుతోంది. ఈబొగ్గు బ్లాకుల్లో 30ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలున్నట్లు చెబుతున్నారు. అయితే శ్రావణ్‌పల్లి ఓసీపీ భూసేకరణ భారంగా మారే పరిస్థితి ఉంది. ఓసీపీ సమీపంలో మామిడి తోటలు ఉండటంతో భారీగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని అధికారవర్గాలు వివరిస్తున్నాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణి సంస్థకు నేరుగా బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీనికి కేంద్రప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయలేదు. వేలంలో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బొగ్గు బ్లాకులు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేలంలో పాల్గొనేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మరోదఫా జరిగే వేలంలో సింగరేణి పాల్గొనే అవకాశాలున్నాయి.

**వేలంలో మేలా.. నేరుగా లాభమా..**

రాష్ట్ర ప్రభుత్వం వేలంలో పాల్గొనేందుకు నిర్ణయం తీసుకోవడంతో సంస్థకు ఏవిధంగా ముందుకెళ్తే లాభమనే చర్చ జరుగుతోంది. అయితే నేరుగా కేటాయిస్తే 14శాతం రాయల్టీ చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. అదే కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలంలో పాల్గొంటే తక్కువ ధరకే బొగ్గు బ్లాకులు దక్కించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇలా దక్కించుకునే బొగ్గు బ్లాకులకు రాయల్టీ చెల్లించే అవకాశం ఉండదని చెబుతున్నారు.

# హోలీ పండుగకు ప్రత్యేక రైళ్లు



రామగుండం: హోలీ పర్వదినం సందర్భంగా ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఫెస్టివల్ స్పెషల్ పేరిట ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. మరోవైపు.. కరీంనగర్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే రైలు నంబరు 07765/66 పుష్‌పుల్ ప్యాసింజర్‌ను సాంకేతిక కారణాలతో ఈనెల 31వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

**రామగుండం రైల్వేస్టేషన్ మీదుగా నడిచే ఫెస్టివల్ స్పెషల్ రైళ్ల వివరాలు..**

- రైలు నంబరు 07219 సికింద్రాబాద్-గోమతినగర్ : ఈనెల 20, 24వ తేదీల్లో నడుస్తుంది. మధ్యాహ్నం 1.48గంటలకు రామగుండం చేరుకుంటుంది.
- రైలు నంబరు 07220 గోమతినగర్-సికింద్రాబాద్ : తిరుగు ప్రయాణంలో ఈనెల 22, 26వ తేదీల్లో నడుస్తుంది. రాత్రి 6.32గంటలకు రామగుండం రానుంది.
- రైలు నంబరు 07221 సికింద్రాబాద్-దర్బంగ : ఈనెల 21, 26వ తేదీల్లో నడుస్తుంది. రాత్రి 10గంటలకు రామగుండం చేరుకుంటుంది.
- రైలు నంబరు 07222 దర్బంగా-సికింద్రాబాద్ : ఈనెల 23, 28వ తేదీల్లో నడుస్తుంది. అర్ధరాత్రి 12.30గంటలకు రామగుండం రానుంది.
- రైలు నంబరు 07227 హైదరాబాద్ దక్కన్-పట్నా జంక్షన్ : ఈనెల 22, 26వ తేదీల్లో నడవనుంది. రాత్రి 8గంటలకు రామగుండం చేరుకుంటుంది.
- రైలు నంబరు 07228 పట్నా జంక్షన్-హైదరాబాద్ దక్కన్ : ఈనెల 24, 28వ తేదీల్లో నడవనుంది. ఉదయం 7.43గంటలకు రామగుండం రానుంది.
- రైలు నంబరు 07229 కాచిగూడ-రక్సోల్ : ఈనెల 22వ తేదీన నడవనుంది. సాయంత్రం 6.09గంటలకు రామగుండం వస్తుంది.
- రైలు నంబరు 07230 రక్సోల్ -కాచిగూడ : ఈనెల 26వ తేదీన నడుస్తుంది. ఉదయం 6గంటలకు రామగుండం రానుంది.




### 'పది' పరీక్షలు ప్రశాంతం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 7,725 మంది విద్యార్థులకు 7,716 మంది పరీక్షలకు హాజరయ్యారని, 99.9శాతం హాజరు నమోదైందని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 17 పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశాయని పేర్కొన్నారు. కాగా, డీఈవో మాధవి ఐదు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరు పర్యవేక్షించారు.

# విద్యార్థులు క్రీడా స్ఫూర్తి చాటాలి


క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న చైర్మన్ సాగర్ రావు

- 'జ్యోతిష్మతి'లో స్పోర్ట్స్ ఫిస్టా -2024
- పోటీలను ప్రారంభించిన చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని జ్యోతిష్మతి కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో స్పోర్ట్స్ ఫిస్టా 2024ను సోమవారం సాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీలు 12 రోజులు సాగుతాయని, కళాశాల ఆవరణలో జరిగే క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. చదువుతోపాటు ఆటల్లో రాణిస్తూ కళాశాల, తల్లిదండ్రులకు పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ఫిస్టాలో భాగంగా క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారం, త్రోబాల్, టేబుల్ టెన్నిస్‌తో పాటు బాస్కెట్‌బాల్ పోటీలు ఉంటాయని వివరించారు. అనంతరం టాస్ వేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకాడమిక్స్ డీన్ డాక్టర్ వైశాలి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ సంపత్‌రావు, కో ఆర్డినేటర్స్ సీహెచ్ సజన్‌రావు, రాజేశ్, సత్య తేజ, ఉదయ్ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

# గొంతునులిమి.. చెట్లపొదల్లో పడేసి..

- ప్రాణం తీసిన మొదటి భర్త
- విడాకులైనా ఇద్దరి మధ్య సాన్నిహిత్యం
- ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన


అంజలి (ఫైల్)

మల్యాల(చొప్పదండి): వారిద్దరూ ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. దీంతో యువతిని మరో వ్యక్తికిచ్చి వివాహం జరిపించారు. అయినప్పటికీ ఆమె తన మొదటి భర్తతో సన్నిహితంగానే ఉంటోంది. ఇంతలో ఏమైందో తెలియదుగానీ.. ఆమెను గొంతునులిమి హతమార్చి చెట్లపొదల్లో పడేశాడు. ఈ సంఘటన మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల పట్టణానికి చెందిన కరిపే అంజలి.. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేశ్ ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. కుటుంబకలహాల కారణంగా రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. అనంతరం అంజలిని సిద్దిపేటకు చెందిన వ్యక్తికిచ్చి మరో పెళ్లి చేశారు. అయినా మొదటి భర్త నరేశ్ అంజలితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతున్నాడు. రెండు రోజుల క్రితం సిద్దిపేట నుంచి జగిత్యాలలోని పుట్టింటికి వచ్చిన అంజలికి ఫోన్ చేసిన నరేశ్.. ఈనెల 17న తన బైక్‌పై తీసుకెళ్లాడు. మ్యాడంపల్లి శివారులోకి చేరగానే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో ఆమె గొంతునులిమి చంపి చెట్లపొదల్లో పడేశాడు. సోమవారం అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నీలం రవి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జగిత్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### చేపలవేటకు వెళ్లి మృత్యువాత


నర్సింగం(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): కొత్తూరు గ్రామానికి చెందిన భూతగడ్డల నర్సింగం(35) సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు బావిలో దిగి ప్రమాదవశాత్తు తూరితీగ చేతులకు చుట్టుకోవటంతో మరణించిన ట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఇదే గ్రామాని కి చెందిన సాగల నారాయణ పొలం వద్దగల వ్యవసాయ బావిలో చేపలు పట్టేందుకు లోనికి దిగిన నర్సింగం.. బావిలోని తూరితీగ చెతులకు చుట్టుకు ని నీట మునిగి ఊపిరాడక మరణించినట్లు మృతు డి భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు తీవ్రగాయాలు


బత్తుల శ్రీనివాస్

ఓదెల(పెద్దపల్లి): ఇందుర్తి గ్రామంలోని అసిస్టెంట్ లైన్‌మన్ బత్తుల శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురయ్యారు. బాయమ్మపల్లెలో సోమవారం విద్యుత్ స్తంభం ఎక్కి కరెంటు తీగలు సరిచేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. ఈక్రమంలో విద్యుదాఘాతంతో కిందపడ్డారు. కాళ్లు, చేతులు కాలిపోవడంతో వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. సిబ్బంది తప్పిదంతోనే విద్యుత్ సరఫరా అయి శ్రీనివాస్ కరెంట్ షాక్‌కు గురయ్యారని గ్రామస్తులు ఆరోపించారు.

# జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


యోగాసన చేస్తున్న శకుంతల

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు మార్కొండ శకుంతల రాష్ట్రస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, జాతీయ స్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. 19 నుంచి 23 వరకు పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీలో జరిగే సీనియర్ జాతీయస్థాయి యోగాసన్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. గతంలో వివిధ జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచారు. రాష్ట్రస్థాయి పోటీల్లో 2017, 2018, 2020లో కాంస్య పతకాలు, 2021, 2023లో బంగారు పతకాలు సాధించారు. జిల్లాస్థాయి పోటీల్లో 2017లో రజతం, 2018లో కాంస్యం, 2019, 2021లో రజతం, 2023లో బంగారు పతకం సాధించారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొనబోతున్న ఆమెను కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అభినందించారు.

### 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడ్డ రేషన్ బియ్యం

మానకొండూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్నీ జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. మండలంలోని ముంజంపల్లి మీదుగా టాటా ఏస్ ట్రాలీ ఆటోలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో తిమ్మాపూర్ మండలం పొరండ్ల శివారులో అధికారులు తనిఖీ నిర్వహించి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలో జిల్లా పౌరసరాఫరాలశాఖ అధికారి గౌరీశంకర్, తిమ్మాపూర్ డీటీ సీఎస్ ఎం. వేణుగోపాల్, కరీంనగర్ డీటీసీఎస్ సురేందర్, తిమ్మాపూర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్, కరీంనగర్ సీఎస్ ఇన్‌స్పెక్టర్ కమలేశ్వర్ పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి కరీంనగర్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీముల్లా ఖాన్ తెలిపారు. సోమవారం 19 మందిని కోర్టులో ప్రవేశ పెట్టగా ఏడుగురుకి మూడు రోజుల జైలు శిక్ష, రూ.16 వేలు జరిమానా, మిగితా 12 మందికి కలుపుకొని రూ.18 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లారీ టైర్ కింద పడి మృతి చెందిన వ్యక్తి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ గ్రామపరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డస్ట్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఎలగందుల మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొంది. సైకిల్‌పై ఉన్న వ్యక్తి టిప్పర్ టైర్ల కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి మహారాష్ట్రకు చెందిన వాసిగా, ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడని స్థానికుల ద్వారా తెలిసింది.

### ఎన్నికల నియామవళి ఉల్లంఘన కేసు

కరీంనగర్‌క్రైం: నగరంలోని కిసాన్‌నగర్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌లోని బేతెస్త చర్చి సెక్రెటరీ ఆధ్వర్యంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా చర్చి సెక్రెటరీ కవ్వంపల్లి తిమోతిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### 'అల్ఫోర్స్' విద్యార్థులకు బంగారు పతకాలు


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): విద్యార్థులకు సైన్స్ కీలకమని, పలు పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి ఉపకరిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ సిల్వర్‌జోన్ ఫౌండేషన్‌వారు నిర్వహించిన అంతర్జాతీయ సైన్స్ ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు గడ్డం విహాన్ రెడ్డి 3వ తరగతి, కె.అమ్తన్ రెడ్డి 5వ తరగతి, జి.అశ్రునయా రెడ్డి 5వ తరగతి, సిద్విక్ నార్ల 6వ తరగతి, అమాన్ ఉల్లా బేగ్ మిర్జా 6వ తరగతి, టి.అమిత్‌విక్రమ్ 7వ తరగతి, పి.అన్మోల్ 7వ తరగతి, పి.అభినవ్ సహస్ర 8వ తరగతి, కె.తనీష్ రెడ్డి 8వ తరగతి, బి.ఆద్యారెడ్డి 8వ తరగతి తదితరులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సోమవారం వారికి పుష్పగుచ్ఛాలు అందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### హుజూరాబాద్‌లో ఏటీఎం చోరీ


ధ్వంసమైన ఏటీఎం మిషన్

హుజూరాబాద్: పట్టణంలోని కరీంనగర్ రోడ్డులోని కోర్టు కాంప్లెక్స్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం నెట్‌వర్క్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌చారి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. దుండగులు సుమారు రూ. 8,64,100 ఎత్తుకెళ్లారని, చోరీ ఆనవాళ్లు దొరక్కుండా ఉండేందుకు ఏటీఎంను ధ్వంసం చేసి తగులబెట్టారని ఫిర్యాదు పేర్కొన్నాడు. ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కరీంనగర్ నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

### గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు సిరిసిల్లటౌన్ సీఐ రఘుపతి తెలిపారు. దాదాపు 48 ఏళ్ల వయస్సు వ్యక్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లో నాలుగు రోజుల క్రితం కిందపడిపోయాడని స్థానికులు తెలపడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతదేహం ఆస్పత్రిలో ఉందని తెలిసిన వారు సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

### అరుదైన వ్యాధితో యువకుడి మృతి

- రూ.15 లక్షలు ఖర్చు చేసినా దక్కని ప్రాణం


పెరుమండ్ల సాయికృష్ణ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అరుదైన వ్యాధితో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు మృతిచెందిన సంఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన పెరుమండ్ల సాయికృష్ణ(23) లిప్టో స్పైరోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అప్పులు చేసి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ప్రాణాలు దక్కలేదు. మృతుడికి తండ్రి వెంకటేశం, తల్లి లలిత, చెల్లెలు అశ్విత ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


లక్ష్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): గంగారం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మొట్లపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(86), తిరుపతి(44) ఆదివారం ఉదయం పని నిమిత్తం సుల్తానాబాద్ మండలం మియాపూర్‌లో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో లక్ష్మయ్య, తిరుపతికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఓంకార్ యాదవ్ తెలిపారు. తిరుపతి చికిత్స పొందుతున్నారని అన్నారు.

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు అద్భుతం

- కేంద్ర అడిషనల్ కోల్ సెక్రటరీ విస్మితా తేజ్


అధికారులతో మాట్లాడుతున్న విస్మితా తేజ్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం రిజర్వాయర్‌లో నిర్మించిన 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు అద్భుతంగా ఉందని కేంద్ర అడిషనల్ కోల్ సెక్రటరీ విస్మితా తేజ్ కితాబునిచ్చారు. సోమవారం ఎన్టీపీసీలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మొక్క నాటి, ప్రాజెక్టుతోపాటు 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు సందర్శించారు. యువ ఇంజినీర్లతో మాట్లాడారు. 93 మీటర్ల దూరంగా ఉన్న వివిధ వ్యవస్థల పనితీరును ఏరియల్ ద్వారా వీక్షించారు. ట్రాక్ హాపర్‌ను సందర్శించి, బొగ్గు నిర్వహణ అధికారులతో అన్‌లోడ్ సమస్యలపై చర్చించారు. అనంతరం ఎన్టీపీసీ, సింగరేణి సంస్థల సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. బొగ్గు లభ్యత, రవాణా, అంశాలపై వివరించారు. రెండు సంస్థలు పరస్పరం సహకారం అందజేసుకోవాలని స్పష్టం చేశారు. సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎఫ్ అండ్ ఎం) ప్రదీప్త కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# కారెక్కిన బీఎస్పీ నేత దాసరి ఉష


దాసరి ఉషను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఇన్‌చార్జి దాసరి ఉష ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గులాబీ పార్టీ కండువా కప్పి దాసరి ఉషను పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన దాసరి ఉష.. సుమారు 10వేల పైచిలుకు ఓట్లు సాధించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ముఖ్య అనుచరురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఉష ఆయన బాటలోనే బీఎస్పీకి గుడ్‌బై చెప్పి బీఆర్‌ఎస్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి పొత్తు విషయమై తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడానికి నిరసనగానే బీఎస్పీని వీడినట్లు ఉష పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రాంతంలో బీఆర్‌ఎస్ పటిష్టత కోసం పనిచేస్తామని అన్నారు.